మహిళా సాధికారతే.. జాతి సాధికారత

ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

తెలుగు యూనివర్సిటీ, మార్చి 10 : ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాల యం ఆడిటోరియంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 30మంది మహిళలకు ఉమెన్ ఐకాన్-2024అవార్డులను ప్రదానం చేసి సత్కరించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సీహెచ్ బాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, సాహితీవేత్తలు డాక్టర్ కె.ప్రతాప్, ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజా యోనా తదితరులు పాల్గొన్నారు.

పలువురు మహిళలకు ఉమెన్ ఐకాన్ అవార్డులను ప్రదానం చేసిన అనంతరం ప్రసంగిస్తున్న సురభి వాణీదేవి

కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రిలో ఓపెన్‌హౌజ్

బేగంపేట్ మార్చి 10 : బేగంపేట్‌లోని కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రి నూతన భవనంలో రోగులకు సేవలు అందుబాటులోకి వచ్చాయని ఆసుపత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. ఆదివారం ఆసుపత్రిలో ఓపెన్‌హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ భాస్కర్‌రావు, డాక్టర్ గురువారెడ్డి మాట్లాడుతూ సన్‌షైన్ ఆసుపత్రి సౌత్ ఏషియాలోనే రోబోటిక్ సర్జరీలో మొదటి స్థానంలో ఉన్నదని తెలిపారు. డాక్టర్ గురువారెడ్డి ఆధ్వర్యంలో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈక్రమంలో ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆడిటోరియంను ప్రముఖ సినీ దర్శకులు ఎస్ఎస్ రాజమౌళి ప్రారంభించారు. ఈ ఓపెన్‌హౌజ్ కార్యక్రమానికి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, సినీ నిర్మాతలు అల్లు అరవింద్, సంగీత దర్శకులు కీరవాణి, కోఠి, నటులు మురళీమోహన్, ప్రకాశ్‌రాజ్, జగపతిబాబు, తణికెళ్ల భరణి, వేమూరి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి స్టేడియంలో కిడ్నీ రన్

ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

శేరిలింగంపల్లి, మార్చి 10 : ప్రజలందరూ తమ కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉన్నదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆధ్వర్యంలో కిడ్నీ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజలకు కిడ్నీ ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు హాస్పిటల్స్, డాక్టర్లు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెఫ్రాలజిస్టు డాక్టర్ వరుణ్, డాక్టర్ సి.మల్లికార్జున, డాక్టర్ పీసీ రెడ్డి, డాక్టర్ దీపక్ రాగూరి, డాక్టర్ క్రాంతి, డాక్టర్ తైఫ్, డాక్టర్ లీలాకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి రన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

ఖైరతాబాద్, మార్చి 10 : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాదిగలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాదిగ జేఏసీ, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 80 లక్షలకు పైగా మాదిగలు ఉన్నారని, కానీ చట్ట సభల్లో మాత్రం జనాభా దామాషా ప్రకారం వాటా దక్కడం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే మాదిగలకు రెండు లోక్‌సభ, ఒక ఎమ్మెల్సీ కేటాయిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గత ఎన్నికల్లోనూ బీజేపీ 14, బీఆర్ఎస్ 13 ఇస్తే కాంగ్రెస్ పది సీట్లు మాత్రమే కేటాయించిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కావస్తుందని, మంత్రివర్గంలో సరైన ప్రాధాన్యతనివ్వలేదని, మంత్రివర్గ విస్తరణలో సైతం మాదిగలకు న్యాయం జరుగలేదన్నారు. నామినేటెడ్ పదవులను సైతం కేటాయించలేదన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమకు హామీ ప్రకారం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారురు. త్వరలోనే గాంధీభవన్‌కు వెయ్యిమందితో వెళ్లి సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తామన్నారు. ఈ సమావేశంలో మాదిగ శక్తి వ్యవస్థాపకులు సురేందర్ సన్నీ, మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గడ్డ యాదయ్య, డాక్టర్ సంజీవ్ నాయక్, బుదాల బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

నోరూరిస్తున్న హలీం

- రంజాన్ వచ్చింది.. హలీం సెంటర్లు వెలుస్తున్నయ్
- నగర వాసులకు ఇష్టమైన అరేబియన్స్ వంటకం
- కొనుగోలుదారులతో కిటకిటలాడున్న సెంటర్లు
- ప్రాంతాలను బట్టి ధరలు నిర్ణయం
- బిజీ బిజీగా తయారీదారులు

సిటీబ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ): రంజాన్ మాసం రాగానే ముస్లింల ఉపవాస దీక్షలతో పాటు వెంటనే గుర్తుకొచ్చేది హలీం. దీంతో నగరంలో హలీం సందడి షురూ అయ్యింది. ప్రతి గల్లీలో హలీం సెంటర్లు వెలుస్తున్నాయి. రంజాన్ మాసం కావడంతో నగర వాసులు హలీం తినడానికి ఆసక్తి చూపిస్తారు. ముస్లింలకు ఇఫ్తార్ విందులో ప్రముఖ వంటకమైన ఈ హలీం.. మతాలకతీతంగా ప్రతి ఒక్కరికీ ఇష్టమైన స్నాక్‌గా మారిపోయింది. రుచితో పాటు పౌష్టికత కలిగిన హలీంను ప్రజలు లొట్టలేసుకుంటూ ఆరగిస్తుంటారు. ఈ వంటకాన్ని అరేబియన్స్ పరిచయం చేశారు. దీనిని హరీస్ అని కూడా పిలుస్తారు. పదో శతాబ్దంలో కితాబ్ అల్ తబిక్ (వంటల పుస్తకం)లో తొలిసారిగా ఈ విషయాన్ని రాశారు. హైదరాబాద్ నిజాం ఆర్మా దగ్గర ఉండే అరేబియన్ సైన్యం హలీంను మన దేశంలోకి తీసుకొచ్చింది. హలీంను చికెన్, మటన్‌తో తయారు చేస్తారు. తయారీదారులు మండీలు ఏర్పాటు చేసి హలీం తయారు చేయడంపై దృష్టి సారించారు. సుమారు 6 నుంచి 8 గంటల వరకు హలీం తయారీకి సమయం పడుతుంది. కేలరీలు అధికంగా ఉండే హలీం ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా తక్షణ శక్తినిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రతీ వంద గ్రాము హలీంలో 157 కాల్యరీలు, 9.7 గ్రాముల ప్రొటీన్, 6.86గ్రాముల కొవ్వు పదార్థం, 15.2 గ్రాముల పిండి పదార్థాలు ఉంటాయని తెలిపారు. హలీం ధరలు ఆయా ప్రాంతాలను బట్టి ఉంటాయి. కాగా, హలీం రుచి కోసం ఇతర రాష్ట్రాల వారు సైతం హైదరాబాద్‌కు తరలివస్తుండటం విశేషం.

ఎంపీ సీటు కేటాయించాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు కోల శ్రీనివాస్ వినతి



ఎమ్మెల్సీ కవితను కలిసి వినతిపత్రం అందజేస్తున్న కోల శ్రీనివాస్

రవీంద్రభారతి, మార్చి 10 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల లేదా హైదరాబాద్ ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసే అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తెలంగాణ రాష్ట్ర పూసల, ఎంబీసీ సంచారజాతుల రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్ కోరారు. ఆదివారం ఎమ్మెల్సీ కవితను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. పోటీ చేసే అవకాశం కల్పిస్తే అత్యధిక మెజార్టీతో గెలిచి కేసీఆర్‌కు బహుమతిగా అందిస్తానని తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి తుమ్మల

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 10 : ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నాయకులు బాలాజీ నాయక్, ప్రవీణ్‌కుమార్, జయరాం, లక్ష్మీప్రసన్న, ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలి

సినీ నటుడు మురళీ మోహన్

సమావేశంలో ప్రసంగిస్తున్న మురళీ మోహన్, పాల్గొన్న ప్రముఖులు

కొండాపూర్, మార్చి 10 : ఆసక్తి గల రంగాలలో పిల్లలను ప్రోత్సహిస్తే తప్పకుండా రాణిస్తారని ప్రముఖ సినీ నటుడు మురళీ మోహన్ అన్నారు. ఆదివారం మాదాపూర్ లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో విజయ్ ఆర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేసిన పాఠశాల, కళాశాల బాలబాలికలకు కార్టూన్, పెయింటింగ్, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యాక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను వారి ఆసక్తిని గౌరవిస్తూ, ఆయా రంగాలలో ప్రోత్సహిస్తే అత్యుత్తమ ఫలితాలను సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకులు ఎస్‌వీ కృష్ణారెడ్డి, సియాసత్ న్యూస్ ఎడిటర్ అమిర్ అలీఖాన్, విజయ్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పాట షికారుకొచ్చింది.. పుస్తకావిష్కరణ

బంజారాహిల్స్, మార్చి 10: వ్యక్తిత్వ వికాస నిపుణులు, వక్త ఆకెళ్ల రాఘవేంద్ర రచించిన 'పాట షికారుకొచ్చింది' పుస్తకావిష్కరణ కార్యక్రమం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు సినీ గీత రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ, దర్శకులు ఎస్‌వీ.కృష్ణారెడ్డి, ఐజీ సుమతి, సిరివెన్నెల సీతారామశాస్త్రి సోదరులు శ్రీరామశాస్త్రి, సీనియర్ పాత్రికేయులు గోవిందరాజు, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాతో కంటిచూపు కోల్పోయే ప్రమాదం

బంజారాహిల్స్‌లోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి ఆవరణలో గ్లకోమా అవేర్‌నెస్ వాక్ ప్రారంభిస్తున్న సినీనటి నిహారిక కొణిదెల, డా. సిద్దార్థ దీక్షిత్ తదితరులు

బంజారాహిల్స్, మార్చి 10 : ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్‌లోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యవిజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గ్లకోమా అవేర్‌నెస్ వాక్ నిర్వహించారు. సినీనటి నిహారిక కొణిదెల ఈ వాక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వైద్యుడు డా.సిద్దార్థ దీక్షిత్ మాట్లాడుతూ కంటి పీడనం పెరగడం వల్ల ఏర్పడే గ్లకోమాతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నదన్నారు. 2040 నాటికి 76 మిలియన్ల నుంచి 111 మిలియన్లకు పెరగవచ్చని తెలిపారు. గ్లకోమాను ప్రారంభదశలో గుర్తించి చికిత్స అందించకపోతే కంటిచూపును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ వాక్‌లో వైద్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా.ప్రశాంత్ గార్గ్, తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాపై అవేర్నెస్

సిటీబ్యూరో: హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్, ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి సంయుక్తంగా ఆదివారం గ్లకోమా అవేర్నెస్ సైక్లింగ్ ఈవెంట్ నిర్వహించారు. ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి నుంచి కేబీఆర్ పార్కు చుట్టూ సైక్లిస్టులు రైడ్ చేస్తూ గ్లకోమాపై అవగాహన కల్పించారు. ఇలా వారంలో మూడు రోజులు అవగాహన కల్పిస్తున్నారు.

సునీతారావు స్మారక పురస్కారాల ప్రదానోత్సవం

రవీంద్రభారతి, మార్చి 10 : 2023 ఫీచర్ సునీతారావు తృతీయ వార్షికోత్సవ స్మారక సాహిత్య పురస్కార ప్రదానోత్సవం ఆదివారం రవీంద్రభారతిలోని జయరాజ్ మినీహాల్‌లో నిర్వహించారు. సంకిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సాహిత్య అకాడమి తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి విచ్చేసి సునీతారావు చిత్ర పటానికి నివాళులర్పించి, గజ్జల రామకృష్ణ, చింత కింద శ్రీనివాస్, ఆడెపు లక్ష్మీపతిలకు సాహిత్య పురస్కారాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పురస్కార కమిటీ పౌండర్ విజయేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తొలి సాహిత్య అకాడమి చైర్మన్ నందిని సిధారెడ్డిని సన్మానిస్తున్న విజయేందర్‌రావు

కిడ్నీ వ్యాధులపై అవగాహన ర్యాలీ

కొండాపూర్, మార్చి 10 : ప్రపంచ కిడ్నీ దినోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం హైటెక్ సిటీలోని మెడికవర్ దవాఖాన ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏడీజీ అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ మెడికవర్ దవాఖాన నుంచి హైటెక్‌సిటీ వరకు కొనసాగింది.

ఇందులో 100కు పైగా బైక్ రైడర్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనుపమ పండూరు, మెడికవర్ చీఫ్ ఆఫ్ బిజినెస్ ఆపరేషన్స్ మహేశ్, నెఫ్రోలజి, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ విభాగపు డైరెక్టర్ డాక్టర్ కమల్ కిరణ్, డాక్టర్ అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీయూఈటీ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఖైరతాబాద్, మార్చి 10 : భారత విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని ది నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించనున్న కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్నాటక అసోసియేట్ ప్రొఫెసర్ లింగ మూర్తి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 27వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ 30న పరీక్షలు నిర్వహించే సెంటర్లను ప్రకటిస్తారని, మే రెండవ వారంలో అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. మే 15 నుంచి 31వ తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు www.nta.ac.in వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చన్నారు.

ఆదివాసీలపై పాలకుల కుట్రలు

ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ నందినీ సుందర్

చిక్కడపల్లి, మార్చి 10 : ఆదివాసీల హక్కులకు భంగం కలిగించే విధంగా పాలకులు కుట్రలు పన్నుతున్నారని ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ నందినీ సుందర్ ఆరోపించారు. పౌరహక్కుల సంఘం 50 వసంతాల సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా 'ఆదివాసీ చట్టాలు- సాయుధీకరణ'' అనే అంశంపై ప్రొఫెసర్ నందినీ సుందర్ ప్రసంగించారు. ఆదివాసీలు తమ భూమిని, గౌరవాన్ని కాపాడుకుంటే వారిని తీవ్రవాదులుగా ముద్ర వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ సత్యపాల్ 'కాషాయీకరణ -దళితులపై దాడులు' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ మాధురి, పి.ప్రసాద్, సంఘం సమన్వయ కమిటీ కన్వీనర్ క్రాంతి చైతన్య, సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలు 13వేలు.. నోటిఫికేషన్ 9వేలకే

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

- బ్యాక్‌లాగ్‌లు ఏర్పడకుండా టీచర్ పోస్టులను భర్తీ చేయాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్, మార్చి 10 : బ్యాక్‌లాగ్ పోస్టులు ఏర్పడకుండా మొత్తం టీచర్ పోస్టులను భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్న అధికారుల మాట వినకుండా, నోటిఫికేషన్ ఇచ్చిన 9210 పోస్టులలో ఏ ఒక్క బ్యాక్‌లాగ్ మిగిలిపోకుండా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన నిరుద్యోగుల సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ రీ లింక్వీస్మెంట్ విధానాన్ని పునరుద్ధరించి మెరిట్ ప్రాతిపదికన అన్ని రకాల అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల విషయంలో పైస్థాయి పోస్టుకు ఎంపిక చేసుకున్న తరువాత మిగిలిన పోస్టులను ఇతర మెరిట్ అభ్యర్థులచే భర్తీ చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున బ్యాగ్‌లాగ్ పోస్టులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. నిరుద్యోగ జేఏసీ నేత నీలం వెంకటేశ్ మాట్లాడుతూ గురుకులాల్లో 13వేల పోస్టులు ఖాళీగా ఉంటే తొమ్మిది వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్లు ఇచ్చారని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే పూర్తిస్థాయిలో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ప్రారంభించాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

కవాడిగూడ, మార్చి 10 : న్యాయపరమైన చిక్కులను తొలగించి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దోమలగూడలోని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 4 విడతల డీఏను వెంటనే విడుదల చేయాలని, కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాములు, చావ దుర్గాభవాని, కోశాధికారి లక్ష్మారెడ్డి, పి.మానిక్ రెడ్డి, ఎం.రాజశేఖర్ రెడ్డి, కార్యదర్శులు కె.సోమశేఖర్, ఎం.వెంకటి, శాంతికుమారి, గాలయ్య, మహబూబ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

కేంద్ర సంఘం అధ్యక్షుడు మంజీత్‌సింగ్

ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్న డ్రైవర్ల సంఘం సభ్యులు

తెలుగు యూనివర్సిటీ, మార్చి 10 : తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ప్రభుత్వ డ్రైవర్ల కేంద్ర సంఘం అధ్యక్షుడు సర్దార్ మంజీత్‌సింగ్ కోరారు. నాంపల్లి నియోజకవర్గం పరిధిలోని కేంద్ర సంఘం కార్యాలయంలో సంఘం ఉపాధ్యక్షుడు ఈ.పద్మారావు, కె.నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ పంతులు శ్రీనివాస్, కార్యదర్శి అలీంఖాన్, కోశాధికారి సయ్యద్ హసం హుస్సేనీ, సంయుక్త కార్యదర్శి ఎం.రామచంద్రం తదితర సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మంజీత్ సింగ్ మాట్లాడారు. ఉద్యోగులకు రావలసిన మూడు డీఏలను, పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బిల్లులను విడుదల చేయలని సూచించారు. జీఓ నంబర్ 5ను రద్దు చేయడంతో పాటు నూతన వాహనాలు కొనుగోలు చేసి డ్రైవర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసిన వారికి పదోన్నతి కలిపించాలన్నారు. ఓడీ సౌకర్యం కలిపించి ఇండ్ల స్థలాలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.